


అనారోగ్యంతో గిరిజన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారి పురంపురం కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బిడ్డిక సీత జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విద్యార్థిని స్వగ్రామం మండలంలోని పుట్టగూడ. రోజువారి మాదిరిగానే సీత గురువారం ఉదయం బాత్రూంకి వెళ్లిన సమయంలో స్పృహ తప్పి పడిపోయిందని, దీన్ని గుర్తించిన సంబంధిత సిబ్బంది వెంటనే తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే విద్యార్థిని మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



మృతి చెందిన సీత

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదు

- అంగన్‌వాడీలకు అండగా ప్రజాసంఘాలు
- బలవంతంగా కేంద్రాలు తెరిపించే ప్రయత్నం
- పిల్లల్ని పంపబోమని చెప్పిన తల్లిదండ్రులు
- ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకోలు



కురుపాం : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పార్వతీపురం : కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా మూడోరోజు గురువారం కూడా కొనసాగింది. ప్రభుత్వ తీరుకు నిరసనగా పలుచోట్ల సమ్మె శిబిరాల వద్ద మోకాళ్లపై నిల్చొని, చెవుల్లో పువ్వులు పెట్టుకొంటూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అలాగే బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన్నప్పలనాయుడు వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో చేసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పోలీసుల సహకారంతో వాలంటీర్లు పగులగొట్టి తలుపులు తెరిచారు.

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పెట్రోలు బంకు సమీపంలో జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె వద్దకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నారని, అటువంటి వారిపై ఎందుకు అంత చిన్న చూపని ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాలను మహిళా పోలీసు వాలంటీర్ ద్వారా తెరిపించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. అనంతరం అంగన్వాడీలు వినూత్న రీతిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాసరావు ఎస్. సింహాచలం, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరకుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జి.సరోజ, సెక్టార్ లీడర్లు కె.విజయభవాని, ఎం.మీన, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

వాలంటీర్లతో కేంద్రాలు తెరిపించిన అధికారులు

సాలూరు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో కొన్నింటిని మున్సిపల్ అధికారులు దగ్గర వుండి తెరిపించారు. కేంద్రాల తాళాలు పగులకొట్టి తెరిపించారు. పట్టణంలో కమిషనర్ జయరాం, మేనేజర్ రాఘవాచార్యులు, రెవెన్యూ అధికారి ఆఫ్రెడ్ గుర్తు సమక్షంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు కేంద్రాలను బలవంతంగా తెరిపించారు. తెరిచిన కేంద్రాలకు పిల్లలను పంపించాలని కోరినా తల్లిదండ్రులు తిరస్కరించారు. పిల్లల ఆలనాపాలనా చూసుకునే అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు విధుల్లో లేనపుడు వారిని ఎలా పంపిస్తామని నిలదీశారు. దీంతో అంగన్వాడీ కేంద్రాలను తెరిపించామని ప్రభుత్వానికి చెప్పుకోవానికే అధికారులు వాలంటీర్లు హడావుడి చేశారు. చినవాకలపేటలో అంగన్వాడీ కేంద్రం తెరిచినా పిల్లలను పంపించేది లేదని స్థానికులు తెగేసి చెప్పారు. డబ్బివీధిలో కేంద్రం తెరిచినా పిల్లలు కనిపించలేదు.

వీరఘట్టం : అంగన్వాడీల సమ్మె బాట పట్టడంతో మూసివేసిన కేంద్రాలను సచివాలయ సిబ్బంది తెరిపించారు. మండలంలోని బొడ్డపాడు, మహదేవవలస, దశుమంతపురం, పనస నందివాడ, తదితర గ్రామాల్లో గ్రామ సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వివో లు, గ్రామ వాలంటీర్లు లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

24 అంగన్వాడీ కేంద్రాల్లో తాళాలు పగులగొట్టిన వాలంటీర్లు

సీతానగరం : మండలంలోని అంగన్వాడీల సమ్మె చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడిఒ అన్ని పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లకు, మహిళా పోలీసులకు పిలుపునిచ్చి 24 కేంద్రాల్లో సోమవారం అంగన్వాడీ కేంద్రాలను తాళాలు పగులగొట్టారు. కాశీపేట, చినబోగిలి, లచ్చయ్యపేట, బూర్జ, సీతానగరం, కృష్ణరాయపురం, గాజులవలస చిన్నరాయుడుపేట, చిన్నంకలాంలోని అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టినట్లు పోలీసు స్టేషన్లో యూనియన్ కార్యదర్శి జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో కార్యకర్తలు ఫిర్యాదు చేశారు.

జాతీయ రహదారి పక్కన రామాథియేటర్ ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా శిబిరాన్ని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు, గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు సందర్శించి మద్దతు పలికారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తామని సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సమ్మెను విచ్ఛిన్నం చేసి అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించడం అన్యాయమన్నారు. వెంటనే వారి డిమాండ్లు ఆమోదించాలని కోరారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎ వద్ద అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వీరి సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి కాంతారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీలు అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, దర్శిమీ, సహాయ అధ్యక్షులు అంజలి, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె మూడో రోజు మండల కేంద్రంలో కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు చెవులో పువ్వు పెట్టి మోకాళ్లతో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు టిడిపి, సిపిఐ, భవన నిర్మాణ, గిరిజన సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నంగిరెడ్డి మధుసూదన్ రావు, అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటి నాయుడు, జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ గుల్లిపల్లి సుదర్శనరావు, తెలుగు అరకు పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ పాలక నూకరాజు, నాయకులు గుల్ల వెంకటనాయుడు, జిల్లా యూత్ అధ్యక్షులు నీరస శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మడక నారాయణరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు అనురాధ, మల్లీశ్వరి, పద్మ, అలివేలు, జ్యోతి, జయమ్మ, పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీల సమ్మె లో భాగంగా మూడవరోజు గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్‌పేట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్విన్‌పేట కూడలి వద్ద మోకాళ్లతో నిరసన, మానవహారం నిర్వహించారు. అంగన్వాడీ ఉద్యోగుల నినాదాలు దద్దరిల్లాయి. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మె శిబిరానికి కురుపాం నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, దుమ్మంగి సర్పంచి పాలక క్రాంతి కుమార్, కుక్కిడి సర్పంచి రాజారావు, ట్రైబల్ రైట్స్ ఫోరం రోబ్బ లోవరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చెముడు గూడ ఎంపిటిసి మండంగి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పువ్వల మోహన్ రావు, బిడ్డిక ఆడిత్తు, యూనియన్ అధ్యక్షులు వై. కస్తూరి పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె గురువారం విజయవంతంగా కొనసాగింది. దీక్షా శిబిరానికి పలు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీ నాయకులు హాజరై తమ మద్దతును తెలిపాయి. ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చు కోవడం కోసం చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తూ వేతనాలు సక్రమంగా అమలు చేయక, ఇతరత్రా అలవెన్సులు అందించడంలో జాప్యం చేస్తూ పొమ్మనలేక పొగ పెడుతున్నారని అన్నారు. జనసేన పార్వతీపురం నియోజకవర్గ కన్వీనర్ ఆదాడ మోహన్ రావు అంగన్వాడీల పోరాటానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.రమణారావు, జివి రమణ, బివి రమణ, పట్టణ పౌరసంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు అలివేలు,గౌరీమణి పెద్ద ఎత్తున అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ చేస్తున్న సమ్మెకు టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ సంఘీభావం తెలిపారు. మాట తప్పని, మడం తిప్పని ముఖ్యమంత్రి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు, లేకుంటే టిడిపి, జనసేన తరుపున ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు ఎన్ని రామునాయుడు, గంటా సంతోష్, సుంకర అనిల్, తదితరులున్నారు. సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిల్చొని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సమ్మెను విచ్ఛిన్నం చేసే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అమరవేణి, జెస్సీబాయ్, హిమప్రభ, తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి : మండలంలో అంగన్‌వాడీ సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గౌరమ్మ, ఎం.సరస్వతి మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను స్పందించకపోగా నిర్బంధాన్ని ప్రయోగించడం మంచి విధానం కాదని విమర్శించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో అంగన్వాడీ కేంద్రాలను నడిపించాలని చూడడం అవేకమైన చర్య అని అన్నారు. ఈ దీక్ష శిబిరంలో సిపిఎం నాయకులు కరణం రవీంద్ర, టిడిపి నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, కంద్యాన బలరాం, జనసేన నాయకులు శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు టిడిపి, జనసేన నాయకులు పెంకి వేణు గోపాల నాయుడు, బంకురు స్వామినాయుడు సంఘీభావం తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చమని కోరుతున్న అంగన్వాడీలను ఉన్నట్టుండి రోడ్డున పడేయడం సరైన పద్ధతి కాదని, సిఎంకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైనదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాదు రాంబాబు, మాజీ ఎంపీపీ పెంకి పార్వతి, జనసేన నాయకులు వెంకటరమణ, పకీర్‌నాయుడు, హరిచరణ్, మార్కండేయ పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె మండలంలో గురువారం కొనసాగింది. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు టి.ప్రభావతి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతూ అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మూడో రోజు అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శైలజ, సునీత, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి, జనసేన మద్దతు తెలిపారు. సమ్మెకు శిబిరానికి పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ బోనెల విజయ్‌చంద్ర విచ్చేసి సంఘీభావం తెలిపారు. టిడిపి అధికారం వచ్చాక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు తమ పార్టీ పూర్తిగా మద్దతునిస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తిరుపతిరావు, కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు, పిజసత్యనారాయణ ఎస్.శ్రీనివాసరావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

సీతానగరం : బొబ్బిలి ఎమ్మెల్యే అంగన్‌వాడీలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక హనుమాన్ జంక్షన్‌లో అంగన్‌వాడీలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై చులకనగా మాట్లాడటం తగదని, ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని, సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, జి.వెంకటరమణతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం నుంచి ఎల్విన్‌పేట వరకూ ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



సాలూరులో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా సీతానగరంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు




సాలూరు : చినదళితవీధిలో అంగన్‌వాడీ తెరిచేందుకు సన్నద్ధమవుతున్న అధికారులు

గృహ నిర్మాణంలో పార్వతీపురం మన్యమే ఫస్ట్

ప్రజాశక్తి - పార్వతీపురం

పేదలందరికీ ఇళ్ల నిర్మాణంలో పార్వతీపురం మన్యం ఉత్తమ జిల్లాగా నిలిచింది. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కె.యస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఇళ్ల నిర్మాణాల గూర్చి వివరిస్తూ పార్వతీపురం మన్యం జిల్లా గహ నిర్మాణంలో మొదటి నుంచి ఉత్తమ జిల్లాగా కొనసాగుతుందన్నారు. ప్రధాన మంత్రి జన్ మాన్ (జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద పివిటిజిలకు ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. ఇళ్లు లేకుండా ఉన్న వారిని గుర్తించి ప్రతిపాదనలను ఈనెల 15నుంచి అందజేయాలన్నారు. రూ.2.39 లక్షల యూనిట్ ఖరీదుతో గృహాలను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, డిఆర్‌ఒ జె.వెంకటరావు, కెఆర్‌ఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

తప్పుడు విమర్శలు చేస్తే కేసులు

పాచిపెంట : తనపై తప్పుడు విమర్శలు చేసిన టిడిపి నాయకులపై పరువు నష్టం దావా, అట్రాసిటీ కేసులు తప్పవని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్నదొర చేతులు మీదుగా 120 మంది లబ్ధిదారులకు 170 ఎకరాల 67 సెంట్లు డి పట్టా డీకే పట్టాలు, అలాగే కొటికిపెంట నిర్వాసితులకు 283 ఇళ్లపట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేస్తే సహించబోనని హెచ్చరించారు. ఒకప్పుడు ఏది కావాలన్నా అధికారుల చుట్టూ ప్రజలు తిరిగేవారని, ఇప్పుడు తమ ప్రభుత్వం అటువంటి పరిస్థితి లేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జనవరి నుంచి రూ.3వేలు పింఛను అందిస్తామన్నారు. మండలంలో రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కావున మళ్లీ వైసిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, వైసిపి నాయకులు డోల బాబ్జీ, పి.వీరంనాయుడు, ఇజ్జాడ అప్పలనాయుడు, దండి ఏడుకొండలు, కె.ధనుంజయ, సలాది అప్పలనాయుడు, గండిపల్లి రాము, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు

మృతుల పేరిట బిల్లులు

- హాజరు లేకుండా చెల్లింపులు
- 2018లో చేసిన పనులకు ఈ ఏడాదిలో బిల్లు
- ఉపాధి పనులపై తనిఖీల్లో అక్రమాల వెల్లువ
- రూ.లక్షల్లో నిధులు గోల్ మాల్

ప్రజాశక్తి - సాలూరు

మండలంలో ఉపాధి హామీ చట్టం కింద ఈ ఏడాది జరిగిన పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాల సర్వేల్లో బట్టబయలైంది. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాభిప్రాయ వేదిక సాక్షిగా 29 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని సర్వే బృందాలు చెప్పాయి. డ్వామా పీడీ కె.రామచంద్రరావు సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామాల వారీగా తేలిన అక్రమాల గురించి సామాజిక తనిఖీ సర్వే బృందాల సభ్యులు వివరించారు. మరణించిన వ్యక్తుల పేరిట పనులు చేసినట్లు చూపుతూ బిల్లులు కాజేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. మస్తర్లు, వేలిముద్రలు లేకుండా చాలా మందికి బిల్లులు చెల్లించినట్లు స్పష్టమైంది. కొంతమంది పేరిట హాజరు లేకుండానే చెల్లింపులు చేయడం కనిపించింది. పెదపదం పంచాయతీలో కందుల గంగులు అనే మరణించిన వ్యక్తి పేరిట వారం రోజుల పాటు బిల్లు చెల్లించినట్లు రుజువైంది. జీవో 17022 ప్రకారం వాలంటీర్లు పని చేస్తే మూడు రోజుల పాటు చెల్లింపు చేయాల్సి ఉంది. కానీ 8మంది వాలంటీర్లకు ఆరు రోజుల పాటు బిల్లు చెల్లించినట్లు డిఆర్‌పి తెలిపారు. పంచాయతీ పరిధిలో సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు చెప్పారు. పనులకు రాలేదని ఆబ్సెంట్ వేసి తర్వాత హాజరైనట్లు రికార్డుల్లో చూపించినట్లు తెలిపారు. చెరువుల పనుల్లోనూ ఎక్కువగా అక్రమాలను గుర్తించారు. ఇదే పరిస్థితి దాదాపు అన్ని పంచాయతీల్లో నూ కనిపించింది.

2018లో చేసిన పనులకు ఇప్పుడు చెల్లింపులు

మండలంలోని తుండ పంచాయతీలో 2018లో ఐటిడిఎ ద్వారా చేసిన రెండు మెటల్ రోడ్డు పనులకు 2022-23లో బిల్లులు చెల్లింపు చేయడాన్ని సర్వే బృందం గుర్తించింది. రూ.18లక్షల మేర ఈ పనులను తాజాగా చెల్లించినట్లు గుర్తించారు. ఇప్పుడు ఆ పనులు పరిశీలించగా బిటి రోడ్లు వేసి వున్నట్లు గుర్తించారు. ఐదేళ్ల క్రితం చేసిన పనులకు ఇప్పుడు చెల్లింపులు చేయడం ప్రశ్నార్థకంగా మారింది. తాజా ఏడాదిలో 29 పంచాయతీల్లో రూ.19 కోట్లు మేర పనులు చేసినట్లు అధికారులు తెలిపారు.



ఉపాధిహామీ సిబ్బందిని వివరణ కోరుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

కొటియా గ్రామాల్లో చెల్లింపుల్లేవు

ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాల్లో గిరిజనులకు రెండు ఆధార్ కార్డు లున్న కారణంగా ఉపాధి బిల్లులు చెల్లించలేదని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. ఈ గ్రామాల్లో ఉపాధి చట్టం కింద పనులు చేసిన గిరిజన కూలీలకు రెండు రాష్ట్రాల ఆధార్ నెంబర్లు ఉండడంతో చెల్లింపునకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎపిడి రమేష్‌రామన్, ఎంపిడిఒ జి.పార్వతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎపిఒలు రామకృష్ణ, సత్యనారాయణ, ఎస్సార్పీ తిరుపతి రావు పాల్గొన్నారు.

కుదరని సయోధ్య.... ఎంఎల్‌హెచ్‌పి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

వైద్యాధికారి, సిబ్బంది మధ్య విధుల నిర్వహణలో కుదరని సయోధ్య కారణంగా ఎంఎల్‌హెచ్‌పి పి.గౌరీలక్ష్మి మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వైద్యం కోసం ఆమెను భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వివరాలకు వెళ్తే కురుపాం మండలం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రజ్ఞ విధి నిర్వహణలో భాగంగా ఇటీవల వలసబల్లేరు సబ్ యూనిట్ కార్యాలయానికి వెళ్లారు. తనిఖీకి వెళ్లే సమయంలో అక్కడ రికార్డులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, మందులు కూడా కాలం చెల్లినవి ఉండడంతో గౌరీలక్ష్మి పనితీరు మార్చుకోమని హెచ్చరించారు. మరోవైపు పిహెచ్‌సి ఉన్నతాధికారుల వేధింపులే తాను ఆత్మహత్యయత్నానికి కారణమని గౌరీలక్ష్మి ఆరోపించారు. పిహెచ్‌సిలో హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వహిస్తున్న పత్తిక భారతి తనను చిన్నచూపు చూస్తూ వేధిస్తూ ఉందని, ఆమె వైద్యాధికారికి లేనిపోనివి చెబుతున్నారన్నారు. తాను గర్భిణినని, తనను ఇలా వేధించడం సమజంసం కాదన్నారు. ఈ విషయమైన వైద్యాధికారి ప్రజ్ఞను వివరణ అడగ్గా, వలసబల్లేరు ఎంఎల్‌హెచ్‌పి పనితీరుపై తనకు, ఉన్నతాధికారులకు గ్రామస్తులు చాలా ఫిర్యాదులు చేశారని, ఆ నేపథ్యంలో తాను వలసబల్లేరు తనిఖీకి వెళ్లడంతో అక్కడ రికార్డులు అన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని, మందులు కూడా కాలం చెల్లినవి ఉండటంతో ఆమె పనితీరు మార్చుకోమని హెచ్చరించామని తెలిపామని అన్నారు. తాను సక్రమంగా విధులు నిర్వహించమని చెప్పడం జీర్ణించుకోలేకనే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. విధినిర్వహణలో ఆమె చేసిన తప్పులు ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. కాలం చెల్లిన మందులను ప్రజలకు ఇస్తే ఇబ్బంది పడతారని, ఆ దృష్టితోనే తాను మందలించడం జరిగిందని అన్నారు



ఆత్మహత్యకు పాల్పడిన ఎంఎల్‌హెచ్‌పి గౌరీలక్ష్మి

17న సచివాలయాల వద్ద ఎండియు

ప్రజాశక్తి - పార్వతీపురం

రేషన్ పంపిణీ సమయంలో అనివార్య కారణాల వల్ల రేషన్ తీసుకొని కార్డుదారుల సౌకర్యార్థం ప్రతి నెలా 17న మధ్యాహ్నం నుండి ఎండియు వాహనాన్ని సంబంధిత సచివాలయం వద్ద ఉంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం నిత్యావసర సరుకులను లబ్ధిదారుల ఇంటి వద్ద సరఫరా చేస్తామన్నారు. నిర్ణీత సమయంలో ఏదైనా అనివార్య కారణం వల్ల రేషన్ తీసుకోని కార్డుదారులు, ప్రతి నెలా 17 నుంచి సంబంధిత సచివాలయం వద్ద నిత్యావసర సరుకులు పొందే అవకాశం వినియోగించు కోవాలని ఆయన కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే 1967 టోల్ నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

రేషన్ బియ్యం పంపిణీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని మర్రివీధికి చెందిన 40మంది లబ్ధిదారులకు గత రెండు నెలల నుండి రేషన్ బియ్యం పంపిణీ చేయలేదని ఈనెల 12న టిడిపి నాయకులు బల్ల హరిబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదేశాల మేరకు వీఆర్వో జి సురేష్ కుమార్ పర్యవేక్షణలో ఎండియు ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు.

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో పనిచేస్తున్న సవర భాష వాలంటీర్లకు గత నాలుగు నెలల నుండి జీతాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున తక్షణమే వేతనాలు చెల్లించాలని సవర భాష వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, ఉపాధ్యక్షులు బి.భీమారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐటిడిఎ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ స్థానిక ఐటిడిఎ పరిధిలో గల 176 పాఠశాలల్లోనూ, సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల 155 పాఠశాలలో సవర భాష ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారందరికీ ఆగస్టు నుండి ఫిబ్రవరి వరకు పాఠశాల విధులకు తీసుకున్నారన్నారు. గౌరవ వేతనంగా ఇస్తున్న రూ.5వేలు కూడా సకాలంలో ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర వేతనంతో కుటుంబ పోషణ చాలీచాలని పరిస్థితిలో ఉన్నామని, కావున ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే కనీస గౌరవ వేతనం పెంపుదల చేయాలని, ఎంటిబి, ఎంఎల్ఇలకు ఇన్ సర్వీస్ ట్రైనింగ్‌ను ప్రభుత్వమే కల్పించాలని, సవర భాష వాలంటీర్లకు మార్చి, ఏప్రిల్ నెలలు కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సవర భాష వాలంటీర్లు మోహన్ రావు, గంగారావు, గోవిందరావు పాల్గొన్నారు.



ఐటిడిఎ వద్ద నిరసన తెలుపుతున్న సవరభాషా వాలంటీర్లు

ప్రజాశక్తి
www.prajasakti.com



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో జి.శివడ రోడ్డు నుంచి వై.కొత్తగూడ వరకు కొత్తగా మంజూరైన బిటి రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి విద్య, వైద్య, రహదారి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తుందని, అందులో భాగంగా ఈ గ్రామానికి 1.20 కిలోమీటర్ల మేరకు రూ.85 లక్షల నిధులతో బీటీ రహదారి పనులకు నిధులు మంజూరయ్యావని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హెచ్. నాగేశ్వరరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పీటిసి సభ్యులు జి.సుజాత, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు సర్పంచులు, వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇవిఎంల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడారులో సంచార ఇవిఎం అవగాహన ప్రదర్శనను ఆర్‌డిఒ కె.హేమలత గురువారం పరిశీలించారు. ఓటర్లుగా ఉన్న వ్యక్తులు ఇవిఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని తెలుసుకుంటూ ఓటును వేస్తున్నారు. వేసిన ఓటు సక్రమంగా పడిందీ లేనిదీ పరిశీలిస్తున్నారు. ప్రదర్శనలో ఓటు వేసిన అభ్యర్థులు తమ ఓటుపై సంతృప్తి చెందారు. బూత్ స్థాయి అధికారి ఇవిఎం అవగాహన ప్రదర్శనను తెలియజేస్తూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇవిఎంలపై స్పష్టమైన అవగాహనకు ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఇవిఎంపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవచ్చని, తద్వారా పోలింగ్ సమయంలో ప్రశాంతంగా, సజావుగా ఓటు వేయవచ్చని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



గిరిజనులకు దుప్పట్లు పంపిణీచేస్తున్న ఎస్ సొసైటీ సభ్యులు

ఎస్ సొసైటీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజనులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని గోటివాడ పంచాయితీ నేరెడువలసలో గురువారం ఎస్.సొసైటీ సంస్థ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యంలోవృద్ధులు, వంటర మహిళలు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు ఎస్ సొసైటీ పలు మంచి కార్యక్రమాలను చేపడుతోందని, రాబోవు రోజుల్లో సంస్థ చేసే కార్యక్రమాలకు తమ వంతు సాయం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ మల్లికార్జునరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు పువ్వల చంద్రయ్య, యువజన సంఘం నాయకులు బిడ్డిక బుల్లయ్య పాల్గొన్నారు.

నేడు పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక గాయత్రి డిగ్రీ కాలేజీలో జాబ్ మేళాను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు (ఐటి, ఫార్మా, హెల్త్, బ్యాంకింగ్, మేనిఫ్యాక్చరింగ్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సెక్టార్స్) హాజరవుతున్నారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంబిఎ చదివిన అభ్యర్థులు అర్హులు అని వారు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

17న మెగా రక్తదానశిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఈనెల 17న న్యూ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శైల పద్మరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, 18 ఏళ్ల పైబడిన వారు రక్తాన్ని దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ, టెంపుల్స్ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ద్వారపురెడ్డి ధనంజయరావు, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ ఇంజినీర్ కె.చందన, ఎలక్ట్రికల్ ఇంజనీర్ శంకరరావు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ డి.పారి నాయుడు, ట్రెజరర్ తామాడ దుర్గారావు, కన్వీనర్ గెంబలి శ్రీరామ చంద్రమూర్తి, మాజీ సర్పంచ్ ఎం.పకీరునాయుడు, శ్రీనివాసరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని బంగారమ్మకాలనీకి చెందిన మన్యం రత్నావతి అనే మహిళకు డిప్యూటీ సిఎం రాజన్నదొర రూ.లక్షా 10వేలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన రత్నావతికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు, కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, పి.మధుసూధనరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

యువగళం సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా భోగాపురం మండలం పోలిపిల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని అరుకు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు కిడారి శ్రవణ్ కుమార్ కోరారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌తో కలిసి మాట్లాడారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర చేపట్టిన తర్వాత యువతలో అనూహ్య స్పందన లభించిందన్నారు. వైసిపి పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర నిరాశతో ఉన్న యువతను చైతన్యం చేయడానికి లోకేష్ పాదయాత్ర చేపట్టారని చెప్పారు. ఈనెల 20న పోలిపిల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

శ్రమకు తగ్గ ఫలితం అందే వరకూ పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు
కలెక్టరేట్ వద్ద ఆశాల వంటా వార్పు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆశా వర్కర్లకు పని భారాన్ని తగ్గించి కనీస వేతనాలు చెల్లించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ప్రారంభించిన 36 గంటల ధర్నా, వంటావార్పు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఆశా కార్యకర్తలపై పని భారాన్ని పెంచిందని, రూ.10వేలు వేతనం ఇస్తున్నామన్న పేరుతో 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. అనేక రకాల పనులను బెదిరించి, వేధించి చేయిస్తున్నారని, మొబైల్ వర్క్ ట్రైనింగ్ ఇవ్వకుండా 14 రకాల యాప్‌ల ద్వారా పని చేస్తున్నారని, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్వర్క్ లేకపోయినా ఫోన్లు పనిచేయకపోయినా ఆశావర్కర్లను బాధ్యుల్ని చేస్తున్నారని విమర్శించారు. సెల్ ఫోన్లు పనిచేయకపోతే సొంత ఫోన్లు కొని పని చేయాలని, లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామనే బెదిరింపులు నిత్యకృత్యమయ్యాయన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ ఆశా వర్కర్ల సేవలు గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని, ఆన్లైన్ లేదా రికార్డ్స్ వర్క్స్ ఏదైనా ఒకపని ఒక్కసారి మాత్రమే చేయించాలని, మొబైల్ వర్క్‌లకు శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు, మెటర్నటీ లీవ్‌లు అమలు చేయాలని, పిహెచ్‌సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని, కోరారు. వీరికి రూ.10లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, కార్యదర్శి బివి రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.శివాని, కె.గౌరీశ్వరి, కె.నిర్మల, లక్ష్మి, గౌరీశ్వరి, పద్మ, త్రివేణి, అంజలి, సుకన్య, భాగ్యలక్ష్మి, పెద్దసంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నా శిబిరం వద్ద రాత్రి భోజనాలు చేస్తున్న ఆశాలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశాల నిరసనకు టిడిపి మద్దతు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎనలేని వైద్య సేవలందిస్తున్న ఆశా వర్కర్ల పనిని గుర్తించి వారికి తగిన వేతనం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవిలు అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి హాజరై మద్దతు టిడిపి తరపున మద్దతు ప్రకటించారు.

శిబిరం వద్దే రాత్రి భోజనం, పడక

పార్వతీపురంటౌన్ : ఆశా వర్కర్ల 36 గంటల ధర్నా, వంటావార్పు నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి శిబిరం వద్దే భోజనాలు చేసి, అక్కడే బస చేశారు. వీరికి సిఐటియు నాయకులు దగ్గరుండి సహాయ, సహకారాలు అందించారు.

17న జిల్లా సమగ్ర అభివృద్ధికై సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురంలో ఈనెల 17న జరిగే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సుకు జిల్లా అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల రావాడ జంక్షన్ వద్ద సిపిఎం నాయకులతో కలిసి జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సు గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం 10గంటలకు బెలగాం చర్చి సెంటర్ కమ్యూనిటీ హాల్లో సదస్సును జరుగుతుందన్నారు. ఈ సదస్సులో జిల్లా అభివృద్ధి కోసం చర్చించి సమగ్ర అభివృద్ధికి నియోజకవర్గాల వారి ప్రత్యేక పోరాట కార్యాచరణ రూపొందించి రాజకీయాలకు అతీతంగా పోరాడి జిల్లాను, నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఇందుకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండలం కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, నాయకులు ఎన్.సింహాచలం, బిడ్డిక కుమార్, పత్తిక రాజేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్


ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు ఉండరాదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని అడ్డాపుశీలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. రైతులు నూర్పిడి చేసిన వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని, వాటికి సంబంధిత మిల్లులకు తరలించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం రవాణా వాహనాలకు విధిగా జిపిఎస్ ఉండాలన్నారు. ధాన్యం తేమ శాతం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సంచులు ఇప్పటికే ఆరు వేలు సిద్ధంగా ఉన్నాయని, మొత్తం ఇరవై వేలు అవసరమని అంచనా వేస్తున్నామని ఆయన చెప్పారు. రవాణా వాహనాల పరిస్థితి ఇతర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలో దుగ్గేరు లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డిఒ కె.హేమలత సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు ఎటువంటి ఆటంకం లేకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. జిపిఎస్ నమోదు చేసిన వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సూర్యనారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సిఆర్‌టిలు మాదిరిగా గుర్తిస్తాం

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కమిటీ తరుపున నర్సీపట్నం హద్దు రోడ్ జంక్షన్ వద్ద టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు గురువారం ఆదివాసీ మాతృ బహు భాష సంఘం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు విన్నవించారు. ఈ వినతిలో 2004లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఏజెన్సీ మారుమూల గిరిజన అదిమ తెగులు చెందిన ప్రాథమిక విద్య కోసం, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో స్థానిక భాషా ద్వారా అదిమ పిల్లలకు విద్యా బోధన జరిగాలని, తమను నియమించారని, సుమారు 20ఏళ్ల నుంచి విధులు సాగించినప్పటికీ తమకు వేతనం పెరగలేదని, ఉద్యోగభద్రత లేదని వాపోయారు. ఆదివాసీ స్థానిక భాషలతో తెలుగు, ఇంగ్లీష్, గణితం కూడా బోధిస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి లోకేష్ స్పందిస్తూ మరో మూడు నెలలు ఓపిక పట్టండి మన ప్రభుత్వం రాగానే సిఆర్‌టిలుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో మాతృబహుభాషా సంఘం రాష్ట్రకార్యదర్శి సవర డోంబు, సభ్యులు పాంగి శ్రీను, కొర్ర సర్బునాయుడు, మర్రి మహేష్, సీదిరి చంద్రమ్మ, పాంగి కుమారి పాల్గొన్నారు.



లోకేష్‌కు వినతిని అందజేస్తున్న ఆదివాసీ మాతృబహుభాషా వాలంటీర్లు

ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ చట్టాన్ని నిరుపేద కూలీలకు అనుకూలంగా అమలు చేసి రెండు పూటలా పని రద్దు చేయాలని, ఏడాదికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి రోజుకు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ వలసల నివారణ కోసం ఉన్న ఊరిలో పని కల్పించాలనే ఉద్దేశంతో అనేక పోరాటాల ఫలితంగా తీసుకొచ్చిన చట్టాన్ని చిత్తశుద్ధిగా అమలు చేయడంలో లోపం జరుగుతుందన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండేలా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఇటీవల కాలంలో ఉపాధి పనుల్లో రెండు పూటలా పనిచేయాలన్న నిబంధన తీసుకొచ్చారని, దీనివల్ల, కూలీలంతా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం వల్ల పని దినాలు తగ్గిపోయాయని, ఉన్న ఊరిలో పనుల్లేక వలస పోతున్నారన్నారు. ఉపాధి పనుల్లో ఏడాదికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. మేట్లుకు పారితోషకం ఇవ్వాలని, కూలీలకు గుణపాలు, పారలు వంటి సామాగ్రి ఇవ్వాలని కోరారు. పనులు చేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు తావు లేకుండా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల కార్యదర్శి గేమ్మేల జానకిరావు, కూనేటి చినబాబు, సీదరపు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సిఐ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.చంద్రమౌళి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా పని చేసి ప్రజల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రత పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటా మన్నారు. సమస్యలపై అవగాహన ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎస్ఐగా ప్రశాంత్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

స్థానిక ఎస్ఐగా ప్రశాంత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బలిజిపేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు అదుపులోకి తీసుకొస్తానన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తానన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ కార్యక్రమం గురువారం స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఇఒ విమల కుమారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరం గల పిల్లల విషయంలో తల్లిదండ్రులు, ఓర్పు సహనం కలిగి ఉండాలనిసూచించారు. వారికి దగ్గరగా ఉండి, పరిచర్యలు చేయడమే కాకుండా ,వారిని భవిష్యత్తులో మంచి పిల్లలకు మార్చే అవకాశం కల్పించేందుకు సహకరించాలని అన్నారు. అనంతరం ఆమె సొంత ఖర్చులతో పలకలు, పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త: భానుమూర్తి, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వరప్రసాద్, ఐడి ఎస్ఎస్ టి.నరసింహమూర్తి, ఐఇఆర్‌పి ఆర్.తిరుమలాదేవి, కె .అనిత, గీత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఎంఇఒలు రాజ్‌కుమార్, దాసు పాల్గొన్నారు. వికలాంగ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

కురుపాం : ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భవిత కేంద్రం వద్ద సిబ్బంది గురువారం వికలాంగ విద్యార్థులకు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధి ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక భవిత కేంద్రంలో గురువారం వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంఇఒలు నాగిరెడ్డి నాగభూషణరావు, కొండలరావు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక స్కూల్ అలాగే హిక్కిం వలస స్కూలుకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంఇఒ నాగభూషణరావు మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న వివిధ రకాలై వసతులు గురించి తెలిపారు. కార్యక్రమంలో 30మంది వికలాంగులకు డిజిటల్ అసిస్టెంట్ కల్పన చేతుల మీదగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీణ, విజయలలిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ వై.వెంకటరమణ పాల్గొని విలాంగులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.



వీరఘట్టం : విద్యార్థులకు బాక్సులు అందజేస్తున్న ఎంపిడిఒ

పాలకొండకు చెందిన ఎల్ఐసి ఏజెంటు పొట్నూరు దుర్గారావు మనవడు రఘువీర్ పుట్టినరోజు సందర్భంగా 30 హాట్ బాక్సులు, కేకులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనంద రావు, ప్రధాన ఉపాధ్యాయులు డి.నారాయణరావు, వి.అన్నాజీ రావు, సహిత ఉపాధ్యాయులు ఆర్.రాంబాబు, యు.ఈశ్వరి, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్ఎంటి సిబ్బంది, వికలాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

20 వరకు విద్యుత్తు పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 14 నుంచి 20 వరకు విద్యుత్తు పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో ఇఇ గోపాలకష్ణ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పొదుపు వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలకు, విద్యార్థులకు, ప్రజలకు విద్యుత్ పొదుపుపై అవగాహన నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మండలంలో 17,250 విద్యుత్ కనెక్షన్ ఉన్నట్లు ఆయన తెలిపారు. అయితే ఇందులో ఇంతవరకు 14,035 సర్వీసులకు ఆధార్ అనుసంధానం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 3215 సర్వీసులు ఆధారు అనుసంధానం చేసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఆయనతో పాటు స్థానిక ఎఇడి బాలాజీ, సిబ్బంది ఉన్నారు

నర్సిపురంలో 'మా నమ్మకం నీవే జగనన్న'

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురంలో బుధవారం ఎంపిపి డి.వెంకట రమణనాయుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అనేక సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యవతి, ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రీ లీలా ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, ఎస్.సింహాచలం, ఇఒపిఆర్‌డి వెంకటరమణ మూర్తి నాయుడు, సచివాలయ కార్యదర్శి జి.రూప, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీడ్ ఆధ్వర్యాన రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన గురువారం సంస్థ సిబ్బందికి, రైతులు, మహిళలకు సేంద్రియ పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు ఆధ్వర్యాన నీడ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల పెంపకం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఇంటి పెరట్లో, పొలాల్లో కూరగాయల సాగు వల్ల ఇంటి అవసరాలతో పాటు ఉపాధి పొందవచ్చు నని చెప్పారు. అనంతరం అడ్వాంటా కంపెనీ కూరగాయల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీడ్ సిబ్బంది మోహన్, రామకష్ణ పాల్గొన్నారు.

కస్టోడియన్ అధికారులు హాజరు కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కస్టోడియన్ అధికారులు హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు అన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. రాబోయే మూడు, నాలుగు రోజులలో ధాన్యం దిగుబడులు పెరగగలవని అందుకు అందరూ సిద్ధంగా ఉండి ఎక్కడా సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పట్టణంతో పాటు మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన అగ్ని ప్రమాదాల్లో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధికారులు, ప్రజా ప్రతినిధులు పరామర్శించి వారికి ప్రభుత్వ సహాయంతో పాటు వ్యక్తిగతంగా సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని పదో వార్డు పెద్ద మాదిగ వీధిలో కురమాన సురేష్ కుమార్ ఇల్లు, నర్సిపురంలో మాచర్ల శ్రీరాములు ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా చూడాలని అదేశించారు. ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు జె.దివ్య, ఎన్.సుధీర్, పిఎసిఎస్ చైర్మన్ కె.సత్యనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపిపి బి.రవి కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

రెల్లలో బాబు షూరిటీ... భవిష్యత్తు గ్యారెంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రెల్ల గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి జగదీశ్వరి, జనసేన పార్టీ కురుపాం సమన్వయకర్త కద్రక మల్లేష్, మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ రానున్న 2024లో టిడిపిని అధికారంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకట్రావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ ఎప్పరిక బుద్దేశ్వరరావు, నాయకులు హాజరయ్యారు.

సీతంపేట : రాబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో వేసే ఓటుతో ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు మారబోతుందని టిడిపి నాయకులు పడాల భూదేవి ఉద్ఘాటించారు. గురువారం సీతంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో టిడిపి కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి కుట్ర జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాను ఏజెంట్లు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. ఇప్పటికే టచ్‌లో ఉన్న ఇతర పార్టీల కార్యకర్తలను పార్టీలోకి అహ్వానించే పనిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో బిడ్డిక జయలక్ష్మి సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటిఎం వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రకృతి వ్యవసాయం విధానంలో తక్కువ భూమిలో ఎక్కువ కూరగాయలను పండించే ఎటిఎం విధానం మండలంలో అమలు తీరును గురువారం డిఆర్‌డిఎ ఎపిడి వై సత్యంనాయుడు, జీవనోపాధి డిపిఎం ప్రవీణ్ కుమార్ రైతులను కలిసి పరిశీలించారు. నవధాన్యాలు వల్ల లాభాలు ద్రవజీవామృతం తయారీ విధానం, రైతు మాటల్లో తెలుసుకున్నారు. ఎటిఎం మోడల్ వల్ల నిరంతరం రైతుకు ఆదాయం వనరులు పరిశీలించారు. కార్యక్రమం అప్పారావు, జయమ్మ ఎపిఎం త్రీనాదమ్మ, శ్రీ రామ్ మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సబ్ ట్రెజరీ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక శోభలత దేవీ కాలనీలో నివాసముంటున్న సబ్ ట్రెజరీ ఉద్యోగి గూడెపు శేఖర్ (33) గురువారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు అందించిన వివరాల ప్రకారం శేఖర్ ఎస్.కోట సబ్ ట్రెజరీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను బంధువులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కొత్తవలసకు చెందిన గండి రామకృష్ణ (50) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బుధవారం ఆయన తన పొలంలో మందు కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురై ఘటనా స్థలంలో మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

200 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ముందస్తు సమాచారంతో కురుపాం సమీపంలో గల మూలిగూడ జంక్షన్‌లో మాటువేసి కారులో అక్రమంగా తరలిస్తున్న పది క్యాన్ల నాటుసారా పట్టుకుని ఐదుగురుపై ఎక్సైజ్, ఎస్ఇబి అధికారులు కేసు నమోదు చేశారు. ఎస్ఇబి ఎస్ఐ బివి నాగభూషణం మాట్లాడుతూ బచ్చలి అఖిల్(25), బచ్చలి రంజన్, జి.కనకదుర్గ, పిన్నింటి అఖిల్, వడ్డాది సురేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

123 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని అమ్మవలసలో సారా విక్రయిస్తున్న యజ్జరపు మహేష్ నుంచి 123 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ముందసు సమాచారం మేరకు ఆ గ్రామానికి వెళ్లి సోదా చేయగా, మహేష్ నుంచి సారా అమ్ముతుండగా పట్టుబడినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహేష్‌ను రిమాండ్‌కుక పంపించినట్టు తెలిపారు.